# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలోని డంపింగ్ యార్డుల్లో ఉన్న 83 లక్షల టన్నుల చెత్తను వచ్చే ఏడాది జూన్ నాటికి తొలగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక బస్సు యాత్రను పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు ప్రారంభించారు.**
3. **ఉచిత ఇసుక పాలసీలో సీనరేజ్ ఫీజును రాష్ట్ర ప్రభుత్వం మినహాయించింది.**
4. **ప్రధాన్ మంత్రి ముద్రా యోజన ద్వారా ఇచ్చే రుణాల పరిమితిని 10 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయలుగా సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం కానుంది.**

==========================

రాష్ట్రంలోని డంపింగ్ యార్డుల్లో ఉన్న 83 లక్షల టన్నుల చెత్తను వచ్చే ఏడాది జూన్ నాటికి తొలగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో నిన్న పురపాలకశాఖ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యర్థాల నుంచి విద్యుత్తు, సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని తిరుపతి, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరులలో వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్ల ఏర్పాటు టెండర్లను వెంటనే పూర్తిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒకరోజు ఆధ్యాత్మిక బస్సు యాత్రను ఈరోజు రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్ వద్ద పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ యాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను ఆకాశవాణి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి కె. వి. వి. సత్యనారాయణ అందిస్తారు.

...వాయిస్ ..

-------------------------

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ- 2024లో సీనరేజ్ ఫీజు, దానికి అనుబంధంగా ఉండే జిల్లా ఖనిజ నిధి, ఖనిజాన్వేషణ నిధులను మినహాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక

సంస్థల పరిధిలో ఉండే నదులు, వాగుల నుంచి అక్కడివారు ఇసుక తవ్వి నేరుగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఉచిత ఇసుక పాలసీపై ఈ నెల 21న జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా ఈ ఉత్తర్వులను జారీ చేశారు. మరోవైపు ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు జీపీఎస్, చెక్ పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ఉద్దేశించిన ప్రధాన్ మంత్రి ముద్రా యోజన ద్వారా ఇచ్చే రుణాల పరిమితిని 10 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయలుగా సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25లో కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదనకు అనుగుణంగా గతంలో 'తరుణ్' విభాగం కింద రుణాలు తీసుకుని, వాటిని తిరిగి చెల్లించిన వారికి ఈ రుణ పరిమితి పెంపు వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

---------------------------

రక్తదానం ప్రాణదానంతో సమానం అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం ప్రకాశం జిల్లా కొండపి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

కృష్ణాజిల్లా కానూరులో ఉన్న విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్ ఆడిటోరియంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం విజయవాడ, విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ సంయుక్తంగా నిన్న మాదక ద్రవ్యాలపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ అవగాహన లేమి కారణంగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని వారికి సరైన అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం కానుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు, మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్‌గా పనిచేసేందుకు అభ్యర్ధులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివసించే అర్హులైన అభ్యర్ధులు ఈ

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆఫ్‌లైన్ విధానంలో వచ్చే నెల 5వ తేదీలోపు ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి పంపించవచ్చని తెలిపారు.

అదే విధంగా అమరావతి రాజధాని ప్రాంతం, శ్రీసత్యసాయి జిల్లాలో పార్ట్ టైమ్ న్యూస్ కరస్పాండెట్లుగా పనిచేసేందుకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ వార్తా విభాగాధిపతి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆఫ్‌లైన్ విధానంలో వచ్చే నెల 8వ తేదీలోపు దరఖాస్తులను విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి పంపవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 9440674057 నెంబరును సంప్రదించవచ్చని వెల్లడించారు.

---------------------------

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విజయవాడలో పోలీస్ శాఖ ఓపెన్‌హౌస్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు, నేరాల నియంత్రణకు ఉపయోగించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆయుధాలు, వైర్‌లెస్ సెట్ల వినియోగం తదితర అనేక అంశాలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుపుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

వరద ప్రభావిత ప్రాంత ప్రజల వాహనాలు, ఆస్తి నష్టాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని బీమా సంస్థలకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో నిన్న ఆయన రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాతో కలిసి బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సంస్థల వారీగా నమోదైన క్లెయిమ్‌లు, పరిష్కరించిన క్లెయిమ్‌లు, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లపై వారితో చర్చించారు.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పరిధిలో పాపికొండల బోట్ యాత్రను రేపటి నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో బోట్లను సబ్ కలెక్టర్ కల్పశ్రీ, పరిశీలించి సన్నాహక పరీక్షను ఈరోజు నిర్వహించారు. బోట్ యాత్ర సమయంలో ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై ఎన్డీఆర్ఎఫ్ బలగాలతో బోట్ల యాజమాన్యానికి, సిబ్బందికి మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాపికొండలు వెళ్లే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని బోట్ల యజమానులకు సబ్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ. పొలిస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

=====================